క్లుప్తంగా

రైల్వే ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన శిక్షలు



తెనాలి రూరల్: రైల్వే ఆస్తుల్ని ధ్వంసం చేయడం, నష్ట పరచడం వంటి చర్యలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడే అవకాశముందని తెనాలి రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) ఏఎస్ఐ శివరామకృష్ణయ్య తెలిపారు. బాపట్ల జిల్లా చుండూరు జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు, చుండూరు రైల్వే గేటు వద్ద నివాసితులకు గురువారం రైల్వే రూల్స్, రైళ్ల మీద రాళ్లతో దాడి, లెవల్ క్రాసింగ్ వద్ద పాటించాల్సిన నిబంధనల గురించి ఆర్పీఎఫ్ సిబ్బందితో కలసి అవగాహన కల్పించారు. చుండూరు గేటు వద్ద ప్రజలతో మాట్లాడారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే, ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడతాయని తెలిపారు. రైల్వే శిక్షాస్మృతి గురించి వివరించారు. రైలు పట్టాలపై దుంగలు, నాణేలు ఇతర వస్తువులు పెట్టడం నేరమని చెప్పారు. రైళ్లు వెళుతున్న సమయంలో రాళ్లు విసరడం నేరమని, అలాంటిని వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ నేతకు సత్కారం

తెనాలి: ఇంటింటికీ రేషను పథకంలో భాగమైన ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చుండూరు సాంబశివరావు (శివ) రాష్ట్ర ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ కోశాధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం నియోజకవర్గంలోని ఎండీయూ ఆపరేటర్లు, 26వ వార్డు కౌన్సిలర్లు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. గుంటూరు జిల్లా యూనియన్, తెనాలి పట్టణం, రూరల్ మండలం, కొల్లిపర మండలాల నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి శివారెడ్డి, సునీల్, సురేష్, సయ్యద్ సుభాని, సత్యం, రమేష్, నరసయ్య, సువర్ణరాజు, గోపి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన తప్పనిసరి

కొల్లిపర: బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలించి సవరణ, మార్పులు, చేర్పులు బాధ్యతగా చేపట్టాలని తహసీల్దార్ జి.నాంచారయ్య సూచించారు. ఆయన గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఓటర్ల జాబితా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలంతా తప్పనిసరిగా ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల జాబితాను పారదర్శకంగా సవరించాలని చెప్పారు. ఓటరు ఫోటో, చిరునామా, పేర్ల మార్పులపై 6ఏ, 7ఏ, 8ఏ దరఖాస్తులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు , వీఆర్వోలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సమృద్ధి కేంద్రాలతో రైతులకు పలు ఉపయోగాలు

కొల్లిపర: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కిసాన్ సమృద్ధి కేంద్రాల్ని రైతులంతా ఉపయోగించుకోవాలని ఏవో కె.వెంకటరావు సూచించారు. స్థానిక జీడీసీఎంఎస్ రిటైల్ దుకాణం వద్ద గురువారం సమృద్ధి కేంద్రాన్ని ప్రారంభించి, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కేంద్రాల్లో రైతులకు అన్ని వ్యవసాయ పనిముట్లను ఒకే వేదిక ద్వారా అందించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు యూరియా గోల్డ్(సల్ఫర్ పూతతో కూడిన యూరియా) అందుబాటులో ఉంటుందని చెప్పారు.

రైల్వే విద్యుత్ తీగను పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్వే విద్యుత్ తీగను పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రాత్రి గూడ్స్ రైలు లూప్ లైన్‌లో నిలిపి ఉంది. ఈ సమయంలో 35నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి గూడ్స్ బోగి ఎక్కి విద్యుత్ తీగలను పట్టుకున్నాడు. తీవ్ర గాయాలతో ఉన్న అతడ్ని 108లో గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మతిస్థిమితం లేని ఉత్తర భారతదేశానికి చెందిన వ్యక్తి అని తమ దర్యాప్తులో తెలిందని పోలీసులు వెల్లడించారు.

31న రేపల్లె మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 31న సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన వహిస్తారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

జామతో ఆరోగ్యానికి ధీమా

- ఉచితంగా లక్ష జామ మొక్కల పంపిణీకి శ్రీకారం
- 29న 10 వేల మొక్కల పంపిణీతో ప్రారంభం
- పట్టణంలో ప్రతి ఇంటికో జామ మొక్క
- శారద సర్వీసెస్ సొసైటీ సంకల్పం
- అందరూ రోజూ జామపండు తినాలనేది డాక్టర్ శారద ఆశయం



డాక్టర్ డి.శారద



నర్సరీలో జామ మొక్కలు

తెనాలి: ఆకలిగా ఉన్నవాడికి చేపను ఇవ్వడం కాదు.. పట్టడం నేర్పాలనేది చైనీస్ సామెత. పండ్లను పంపిణీ చేయడం కాదు.. ఏకంగా మొక్కను, అదికూడా ఆరోగ్యానికి మహాభాగ్యమనదగ్గ జామ మొక్కను ఇచ్చి చూడు అంటున్నారు పట్టణానికి చెందిన వైద్యురాలు డాక్టర్ శారద. అనడమే కాదు...తానే అందుకు ముందుకొచ్చారు. పేదవాడి యాపిల్ అనదగిన జామకాయలు కొని తినడం కాదు... ఇంటిలోనే ఆ మొక్కను పెంచి, రోజు కోసుకుని తినాలనేది ఇప్పుడామె నినాదం. స్వచ్ఛంద వైద్యసేవలతో ప్రముఖంగా గుర్తింపును పొందిన డాక్టర్ శారద, జామ మొక్కల పంపిణీని ఒక ఉద్యమంలా చేపడుతున్నారు.

ఇంటికో జామ మొక్క పంపిణీ లక్ష్యం

డాక్టర్ డీ3 శారద సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకురాలైన డాక్టర్ డి.శారద పట్టణంలోని ప్రతి ఇంటికీ జామ మొక్కను ఉచితంగా పంపిణీ చేయాలని సంకల్పించారు. ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు బుర్రిపాలెం దగ్గరి డాక్టర్ శారద భవనంలో ఇందుకోసం ప్రత్యేక సభను నిర్ణయించారు. తెనాలిలోని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పాల్గొనే సభలో దాదాపు 10 వేల జామ మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు డాక్టర్ శారద వెల్లడించారు. పట్టణంలోని 43,604 ఇళ్లకు ఒక్కో జామ మొక్కను అందించాలనేది ప్రణాళిక. ఇందుకోసం రూ.లక్షకు పైగా వెచ్చించనున్నారు. ఇంటిలో మొక్కలు పెంచుకునే వెసులుబాటు లేని అపార్టుమెంట్లలో నివసించే కుటుంబాలకు కుండీల్లో కూడా పెంచుకునే వీలు కలిగిన మరుగుజ్జు జామమొక్కలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం

జామలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.దీనితోపాటు సీ–విటమిన్ కూడా ఉండటంతో కణాల ఆరోగ్యాన్ని కాపాడుతుందని, కొల్లాజిన్ ఉత్పత్తితో చర్మంలో మెరుగు వస్తుందని డాక్టర్ శారద చెప్పారు. జామలోని ఏ–విటమిన్ కళ్ల ఆరోగ్యానికి, బీ 6 విటమిన్ మెదడు చురుకుదనానికి మంచివని తెలిపారు. అధికబరువుతతో బాధపడే వారు జామపండ్లను తినాలని, పీచుపదార్థం ఎక్కువగా ఉండే ఈ పండు తినంటే జీర్ణప్రక్రియ సాఫీగా జరుగుతుందని వివరించారు. రోజుకు 200 గ్రాముల నుంచి అర కిలో వరకు జామ ముక్కలను తింటే గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుందని, ఇందులోని పొటాషియం రక్తనాళాల్లో రక్తపోటు జరక్కుండా కాపాడుతుందని వివరించారు.

సొసైటీ ద్వారా పలు సేవలు

డాక్టర్ శారద తన సర్వీసెస్ సొసైటీతో మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలిని సాకారం చేయాలనే దిశగా కొంతకాలంగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. రొమ్ము క్యాన్సర్, గర్భకోశ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తూ స్వచ్ఛంద పరీక్షలు చేస్తున్నారు. ఎమ్మెల్యే శివకుమార్ ప్రోత్సాహం, మున్సిపాలిటీ సహకారంతో వార్డుల వారీగా ప్రత్యేక క్యాన్సర్ పరీక్షా శిబిరాలను నిర్వహించారు. ముందస్తుగా గుర్తించటం వల్ల తేలికగా నయం చేసుకోవచ్చనేది డాక్టర్ శారద భావన. ఇదే క్రమంలో ఇంటికో జామమొక్క–దేశానికి వెన్నెముక అనే నినాదంతో ఇప్పుడు ఉచిత మొక్కల పంపిణీని ఉద్యమంలా చేపడుతున్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి



ఐయితానగర్‌లో ముంపునకు గురైన పొలాల వద్ద రైతు నేతలు

తెనాలి: భారీవర్షాలతో నష్టపోయిన పంట పొలాల్ని పరిశీలించి, నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా అయితానగర్, నేలపాడు, తేలప్రోలు, కంచర్లపాలెం గ్రామాల్లో ముంపునకు గురైన ప్రాంతాల్ని ఆయన రైతుల, కౌలురైతులతో కలసి గురువారం పరిశీలించారు. ఇప్పటికే ఎకరాకు రూ.7–8 వేలు వ్యయం చేసి వరి వెదజల్లినట్టు రైతులు కొందరు చెప్పారు. మళ్లీ దమ్ము చేసి వెద పెట్టడం. నారు కొనుగోలు చేసి నాట్లు వేయాలంటే మరో రూ.10–15 వేలు ఖర్చవుతాయని తెలిపారు. అయితానగర్ రైతు సంఘం అధ్యక్షుడు ఈదర పూర్ణచంద్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగు వర్షాల కారణంగా 20 రోజులు పైగా ఆలస్యమైనట్టు చెప్పారు. ఈ ప్రభావం ఖరీఫ్, రబీ పంటలపై పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అయితానగర్‌కు సమీపంలోని జగనన్న కాలనీ వద్ద మూడో తూము ఏర్పాటు చేయాలని, కాల్వపై అడ్డంకులు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును కలసి శివసాంబిరెడ్డి, పూర్ణచంద్ కోరారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్, రైతులకు అవసరమైన తోడ్పాటును అందించాలని ఇంజనీర్లకు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి బుధవారం తెనాలి వచ్చి ముంపునకు గురైన భూముల్ని సందర్శించకుండా, వ్యవసాయ కార్యాలయంలో నలుగురైదుగురు రైతులతో మాట్లాడి వెళ్లటాన్ని ఖండించారు. వారి వెంట రైతులు మేకల చిట్టిబాబు, వేజెండ్ల నాగేశ్వరరావు, జెట్టి సుధాకర్, తుల్లిమిల్లి నాగేశ్వరరావు, కన్నెగంటి భాస్కరరావు, మేకల ప్రసాదరావు, మంద్రు బాలస్వామి, మేకల మధు, బేతాళ చిన్న, పిల్లి బాబూరావు ఉన్నారు.

లంక ప్రజలూ.. అప్రమత్తంగా ఉండండి !



కృష్ణా నదిలో వరద నీరు పరిశీలిస్తున్న తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో చంద్రమోహన్

కొల్లిపర: గత ఆరు రోజుల నుంచి కృష్ణా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు సాగర్ నుంచి వరద నీటిని బుధవారం దిగువకు వదిలిన కారణంగా మండల పరిధిలోని లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీవో వి.చంద్రమోహన్ సూచించారు. మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, పాతబొమ్మువానిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంక గ్రామాల్లో గురువారం మండల స్థాయి అధికారులు సిబ్బందితో , పార్టీ నాయకులతో కలసి ఆయా గ్రామాల్లో వరద ఉధృతి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఎంపీడీవో, తహసీల్దార్ మాట్లాడుతూ నదిలో వరద నీరు చేరడం వల్ల లంక గ్రామాల్లో కూలీ పనులకు వెళ్లే వారంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రిపూట సమయంలో తప్పని పరిస్థితిలో మాత్రం పడవ వేయాలని చెప్పారు. నదిలో వరద ఉధృతి పూర్తిగా తగ్గే వరకూ పిల్లలు, వృద్ధులు ఇటు వైపు రాకుండా వీఆర్వోలు, వీఆర్ఏలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, పోలీస్ సిబ్బంది, వీఆర్వోలు ఎప్పటికప్పుడు వరద ఉధృతి, గ్రామాల్లోని పరిస్థితుల్ని పరిశీలిస్తూ తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉంటే వెంటనే లంక ప్రజల్ని తూములూరు, కొల్లిపర, హనుమాన్‌పాలెం పాఠశాలలోకి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్. రవీంద్రరెడ్డి, కొల్లిపర ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీమవరపు సంజీవరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, అవుతు పోతిరెడ్డి పాల్గొన్నారు.

పంట పరిరక్షణకు కర్షకుల కష్టం



క్రాప వద్ద వరి పొలంలోకి పైపును మోసుకెళ్తున్న రైతులు



వెద పద్ధతిలో సాగు చేసిన వరి పొలంలో వర్షపు నీటిని ఆయిల్ ఇంజిన్ సాయంతో తోడివేత

కొల్లూరు: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ముంపు బారిన పడిన పంటలను రక్షించుకునేందుకు కర్షకులు నడుం బిగించారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా వర్షాలు అధికంగా కురవడంతో ఖరీఫ్‌లో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. గురువారం ముసురు పట్టిన వాన తెరిపివ్వడంతో రైతులు పంటను కాపాడుకునే పనిలో పడ్డారు. ఎకరాకు రూ.3 వేల వరకు వెచ్చించి అద్దెకు ఆయిల్ ఇంజన్‌ల సాయంతో వర్షపు నీటిని బయటకు తోడే ప్రక్రియ చేపట్టారు. ఆయిల్ ఇంజన్ వెసులు బాటు లేని రైతులు కూలీల సాయంతో పొలంలో కాల్వలు తీసి నీటిని బయటకు మళ్లించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు



ట్రై సైకిల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భట్టిప్రోలు: సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతి భావంతులైన విద్యార్థుల (సీడబ్ల్యూఎస్ఎన్)కు గురువారం భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగు పందెం, షాట్‌పుట్, డిస్క్ త్రో, ట్రై సైకిల్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో–2 దేవరాజు, ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరావు, ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి , పీఈటీలు చేబ్రోలు శ్రీనివాసరావు, ఎంవీఎస్ నాగేశ్వరావు, బీసీ హాస్టల్ వార్డెన్ చంద్రశేఖర్, ఐఈడీ టీచర్లు మేరీ ఇవాంజలిన్, టి.రత్నాకర్, సీఆర్పీలు సలోమి, కృష్ణారావు, రాజ్యలక్ష్మి, దాసరి లక్ష్మి పాల్గొన్నారు.

రీసర్వే త్వరితగతిన పూర్తిచేయాలి

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మీ భూమి–మా హామీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా కారుమూరు సచివాలయంలో మండల, గ్రామ సర్వేయర్లతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో భూకమతం ఒక సర్వే నంబరు కింద ఉండి, కాలక్రమేణా విభజన జరిగి చేతులు మారినా సర్వే రికార్డులు క్రమబద్ధీకరణ జరగక పోవటంతో భూ, ఇతర వివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈ సర్వేతో ఆ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సర్వేయర్లను తహసీల్దారు ఆదేశించారు.

కేఎల్‌యూలో ఉస్తాద్ చిత్ర బృందం సందడి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం కేఎల్ ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో ఇట్స్ షో టైమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉస్తాద్ చిత్ర బృందం విచ్చేసి విద్యార్థులను ఉత్సాహపర్చింది. సాక్ డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ ఇట్స్ షో టైమ్ అనే కార్యక్రమం వలన విశ్వవిద్యాలయం శక్తివంతమైన చలన చిత్ర సంస్కృతిని ప్రదర్శించిందని అన్నారు. అత్యంత ప్రశంసలు పొందిన వారాహి చలనచిత్రం ఉస్తాద్ కథానాయకుడు ఫణిదీప్, కథానాయికి కావ్య కళ్యాణి రామ్‌లు విద్యార్థులు రూపొందించిన లఘు చిత్రాలను వీక్షించారు. యూనివర్సిటీలోని ప్రతిభావంతులైన విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలు, ఇతర సినిమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి విభాగ సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఫిలిం క్లబ్ మెంటార్ వేణు, సాక్ విద్యార్థుల మెంటార్లు పి.వి.సత్యనారాయణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పాస్టర్ అబ్రహం మృతి



వెల్లబాడు(వేమూరు): మండలంలోని వెల్లబాడు గ్రామంలోని లూథరన్ చర్చి పాస్టరు కొత్తపల్లి అబ్రహం గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఆయన మృతదేహానికి గ్రామ సర్పంచ్ వెల్లబాటి బుల్లియ్య, ఆంధ్ర లూథరన్ ఇవాంజికల్ సెక్రటరీ చిన్నం కిషోర్, రెవరెండ్ రత్న మోహన్, వివిధ చర్చిల పాస్టర్లు నివాళుర్పించారు. గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేం రాజు తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



కర్లపాలెం: వరి సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని డీడీఏ విజయనిర్మల తెలిపారు. కర్లపాలెం సచివాలయంలో రైతులకు గురువారం సాగులో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వరి సాగులో అవసరం మేరకే ఎరువు వినియోగం ఉండాలని స్పష్టం చేశారు. పైర్లకు ఆశించే తెగుళ్లను గుర్తించి, సరైన మోతాదులోనే పురుగు మందు పిచికారీ చేయాలని చెప్పారు. వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పైరుకు కావాల్సిన గాలి, వెలుతురు సమృద్ధిగా లభిస్తాయన్నారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ ఓబయ్య మాట్లాడుతూ.. భూమి ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ ఎరువులు అందించాలని తెలిపారు. భూమి సారవంతమయ్యేందుకు పచ్చిరొట్ట, జీవ ఎరువులు వినియోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.లక్ష్మి, ఏఓ సుమంత్ కుమార్, ఏఈవో భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భ్రమరాంబ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి మిస్సైల్ మ్యాన్ కలాం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్



కొలకలూరు జెడ్పీ హైస్కూలులో కలాం చిత్రపటం వద్ద నివాళి

- వర్ధంతి సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- రక్తదాన శిబిరం, అన్నదానం, విద్యార్థులకు పుస్తకాల వితరణ
- చిన్న ఉపగ్రహాల తయారీ శాస్త్రవేత్త సాయిదివ్యకు సత్కారం

తెనాలి: అతి సాధారణ కుటుంబంలో జన్మించి శాస్త్రవేత్తగా మిస్సైల్ మ్యాన్ అనిపించుకోవడమే కాకుండా, దేశంలో అత్యున్నత పదవిని చేపట్టిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మైనారిటీ నేతలు కాలేషా, మీరావలి సోదరులు గురువారం స్థానిక గంగానమ్మపేటలో అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్, తెనాలి శాఖ ఆధ్వర్యంలో అక్కడే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదానాన్ని కూడా ప్రారంభించారు. చిన్న ఉపగ్రహాలను తయారుచేస్తూ ×లక్ష్య శాట్¤ పేరుతో ప్రయోగించిన పట్టణానికి చెందిన కొత్తమాసు సాయిదివ్యను సత్కరించి, ఏపీజే అబ్దుల్ కలామ్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సభలో మాట్లాడుతూ పేద కుటుంబంలోంచి వచ్చిన అబ్దుల్ కలాం, క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని, ఉన్నత శాస్త్రవేత్తగా ఎదిగారని ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. రక్షణరంగ శాస్త్రవేత్తగా భారత సైన్యం అమ్ములపొదికి ఎన్నో రకాల క్షిపణులను రూపొందించినట్టు చెప్పారు. ఆయుధ సంపత్తిలో భారతదేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలబెట్టారని చెప్పారు. ఆయన సేవల్ని గుర్తించిన నాటి కేంద్రప్రభుత్వం రాష్ట్రపతి వంటి అత్యున్నత పదవికి ఎంపిక చేసిందని వివరించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు గొడవర్తి సాయిహరేరామ్, వీర్లపాటి విజయలక్ష్మి, గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేసు శ్రీనివాసరావు, వుప్పల వరదరాజులు, కఠారి హరీష్, కుర్రా శ్రీను, చుండూరు సాయి, పెసర్లంక రమణ, మునిపల్లి వంశీ, మహాప్రస్థానం సేవా సమితి జెట్టి శివరామకృష్ణప్రసాద్, ప్రముఖ వ్యాపారులు కొత్తమాసు కుమార్, పెనుగొండ వెంకటేశ్వరరావు, తట్టుకూళ్ల అశోక్ యాదవ్, కాళిదాసు వెంకటేశ్వరరావు, గంజన బోయిన ప్రతాప్ పాల్గొన్నారు.

కలాం సేవలు మరువలేనివి

తెనాలి టౌన్: భారత అణుపితామహుడు, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని గురువారం రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి కలాం అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎ.పద్మావతి, ఉపాధ్యాయులు ఎం.అన్నారావు, టి.శ్రీనివాసరావు, మారుతి కిరణ్, బాలు నాయక్, వెంకటేశ్వరరావు, పద్మావతి, సుజాత, సుభాషిణి, దేవికారాణి, శోభ, శివశంకర్, బాలశంకర్, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు, పక్కన ఎస్ఐలు విజయ్‌కుమార్, వెంకటేశ్వరరావు

తెనాలి రూరల్: తెనాలి పట్టణ శివారు పినపాడు దుండిపాలెం డొంక రోడ్డులో ఈ నెల 25న జరిగిన దారి దోపిడీ కేసును త్రీ టౌన్ పోలీసులు ఛేదించారు. ఆటో ఎక్కిన ఓ వ్యక్తిని మారుమూల ప్రదేశానికి తీసుకువెళ్లి బెదిరించి సెల్‌ఫోన్, నగదు లాక్కున్న ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాల్ని సీఐ ఎస్. రమేష్‌బాబు తెలియజేశారు. సుల్తానాబాద్‌లోని ఆలపాటి నగర్‌కు చెందిన ముప్పాళ్ల శివ చంద్రశేఖరరావు ఈ నెల 25న ఉదయం భట్టిప్రోలులో డ్యూటీకి వెళ్లి, తిరిగి రాత్రి 8.30 గంటలకు తెనాలి చేరుకున్నారు. ఇంటికి వెళ్లేందుకని మార్కెట్ వంతెన వద్ద ఆటో ఎక్కారు. ఆటోలో అప్పటికే ఇద్దరు యువకులు ఉండగా, తాను మార్కెట్ యార్డు వద్ద దిగుతానని చెప్పి చంద్రశేఖరరావు ఆటోలో కూర్చున్నారు. అప్పటికే ఆటోలో ఉన్న మోరిస్‌పేట సీఎం కాలనీకి చెందిన కట్టా ఏసయ్య అలియాస్ ఏసు, కొవెవరం కాలువ కట్ట రోడ్డుకు చెందిన గుంజి శ్రీను, కమాధుల ఏసురత్నంలు సుల్తానాబాద్‌లో ఆటో ఆపకుండా పినపాడు గ్యాస్ గోడౌన్ సమీప నిర్మానుష్య ప్రాంతానికి చంద్రశేఖరరావును తీసుకు వెళ్లారు. అక్కడ అతడిని బెదిరించి జేబులో ఉన్న స్మార్ట్ ఫోన్ , ఓ లెదర్ బ్యాగ్, రెండు వేల రూపాయల నగదు లాక్కున్నారు. అప్పుడే అటుగా ఓ మోటార్ బైక్ రావడంతో అది చూసి వారు ఆటోతో సహా పరారయ్యారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఒక రోజు వ్యవధిలోనే ముగ్గురు నిందితుల్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వారి నుంచి బ్యాగుతో పాటు సెల్‌ఫోన్, నగదు, నేరం చేసేందుకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్ని అరెస్టు చేసిన సీఐ రమేష్ బాబు, ఎస్ఐలు కె. వెంకటేశ్వరరావు, విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ నరేష్, సిబ్బంది రంజిత్, అంకయ్యను డీఎస్పీ బి. జనార్దనరావు అభినందించారు.

మిషన్ ఇంద్ర ధనుష్ విజయవంతమే లక్ష్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది, మండల వైద్యాధికారిణి లక్ష్మీసుధ

కొల్లిపర: మిషన్ ఇంద్ర ధనుష్ ద్వారా ఆగస్టు నుంచి ప్రభుత్వం ప్రారంభించనున్న జాతీయ వ్యాధినిరోధిక టీకాల కార్యక్రమాన్ని ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, ఎంపీపీ భీమవరపు పద్మావతి తెలిపారు. అన్ని గ్రామాల్లో గర్భవతులు, పిల్లలకు టీకాలు వేస్తూ మండలంలో వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులకు, వైద్య సిబ్బందికి టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధ మాట్లాడుతూ గ్రామాలల్లో ఇప్పటి వరకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని గర్భిణులు, రెండేళ్లలోపు పిల్లల్ని గుర్తించి టీకాలు వేయాలని సూచించారు. ఆగస్టులో 7నుంచి 12వరకు, సెప్టెంబరులో 11నుంచి 16వరకు, అక్టోబరు లో 9నుంచి 14వరకు ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు సమష్టిగా టీకాలు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీవో వి.చంద్రమోహన్, ఎంఈవో–1 సాల్మన్‌రాజు , ఎంఈవో–2 ఝాన్సీలత, సీడీపీఓ సునీత, మండల సమాఖ్య అధ్యక్షురాలు టి.సుజాత పాల్గొన్నారు.

4న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

భట్టిపోలు: భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆగష్టు 4న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, భక్త బృందం గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, నాగవల్లి దళాలతో విశేష అర్చన, అఖండ కర్పూర హారతి వంటి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.